యుద్ధానికి సిద్ధం కండి

సైన్యానికి చైనా అధ్యక్షుడు ఆదేశాలు

బీజింగ్, అక్టోబర్ 20: ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో ప్రపంచం వణికిపోతుంటే, కొత్తగా చైనా కూడా యుద్ధ భేరీ మోగించేందుకు సిద్ధమవుతున్నది. తైవాన్ చుట్టూ పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు చేపడుతూ, ఆ దేశాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పతాక స్థాయికి చేరుకుంది. యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ తమ దేశ సైనికులకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తాజాగా పిలుపునిచ్చారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను జీ జిన్‌పింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సమగ్రమైన శిక్షణ, సన్నద్ధతతో సైనిక బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. తమ పోరాట సామర్థ్యాల్ని పెంచుకోవాలి' అని అన్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీసీటీవీ తాజాగా పేర్కొన్నది. తైవాన్ స్వతంత్ర, సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తున్న చైనా, ఆ దేశం చుట్టూ పెద్ద ఎత్తున మిలటరీ డ్రిల్స్‌ను నిర్వహించటం సంచలనంగా మారింది. తైవాన్‌కు అత్యంత సమీపంలో యుద్ధ విమానాలు, డ్రోన్లు, యుద్ధ నౌకలు, కోస్ట్‌గార్డ్ నౌకలతో చైనా సైనిక విన్యాసాలు మరింత ఉధృతమయ్యాయి. తైవాన్‌ను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు యుద్ధం చేయడానికి వెనుకాడబోమని బీజింగ్ నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది.

ఉక్రెయిన్‌పై రష్యా చేసిన క్షిపణి దాడిలో వెలువడుతున్న మంటలు

రష్యాపై 100 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

కీవ్: ఉక్రెయిన్-రష్యా సంక్షోభం రోజురోజుకు ముదురుతున్నది. తాజాగా ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించిన క్షిపణి దాడిలో 17 మంది గాయపడగా, ప్రతిగా రష్యాపై ఉక్రెయిన్ 100కు పైగా డ్రోన్లతో విరుచుకుపడడింది. ఉక్రెయిన్‌లోని క్రైవిరిహ్‌లో శనివారం రష్యా క్షిపణి దాడిలో పలు ఇండ్లు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. ఈ రెండున్నరేండ్లలో రష్యాపై ఇంత భారీగా వైమానిక దాడులకు పాల్పడటం అరుదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కురుష్క్ సహా తమ భూభాగంలోని పలు ప్రాంతాలకు వచ్చిన 110 డ్రోన్‌లను ధ్వంసం చేసినట్టు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. డెజెర్కిన్స్‌లో మందుగుండు సామగ్రి ఫ్యాక్టరీని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్టు ఉక్రెయిన్ వెల్లడించింది.

'పన్నూ హత్య కుట్ర ఆరోపణలు అవాస్తవం'

ప్రాణ్‌పుర: ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యకు భారత మాజీ నిఘా అధికారిగా చెప్తున్న వికాశ్ యాదవ్ కుట్ర పన్నారని వచ్చిన ఆరోపణలను అతడి కుటుంబం ఖండించింది. ఎఫ్‌బీఐ వికాస్‌ను విచారణకు కోరడం తమకు షాక్ కలిగించిందని తెలిపింది. వికాశ్‌పై వచ్చిన ఆరోపణలన్నీ మీడియా సృష్టేనని ఆయన పిన తండ్రి కొడుకు అవినాశ్ యాదవ్ తెలిపారు. వికాశ్ భారత గూఢచార అధికారి అని అమెరికా గురువారం తన అభియోగ పత్రంలో పేర్కొంది. పన్నూ హత్య కోసం నిఖిల్ గుప్తా అనే భారతీయుడికి వికాశ్ రూ.12 లక్షలు చెల్లించారని ఆరోపించింది. దీనికి భారత్ స్పందిస్తూ అతడు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగి కాదని.. అతడిపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది.

ఉత్తర గాజాపై బాంబుల వర్షం

- 87 మంది మృతి.. పాలస్తీనా అధికారుల వెల్లడి
- ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సన్నాహాలు!
- దాడికి సంబంధించిన రహస్య పత్రాలు లీక్

న్యూయార్క్, అక్టోబర్ 20: ఉత్తరగాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు కొనసాగించిన దాడుల్లో పలు గృహాలు ధ్వంసమయ్యాయని, 87 మంది ప్రజలు మరణించడమో, గల్లంతు కావడమో జరిగిందని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. బీట్‌లాహియాలో ఇజ్రాయెల్ పదాతి దళాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు గాయపడ్డారని వెల్లడించింది. ఉత్తర గాజాలో శనివారం రాత్రి నుంచి ఇంటర్నెట్ కట్ అయినట్టు అధికారులు తెలిపారు. అయితే దీనిపై ఇజ్రాయెల్ మిలటరీ ఎలాంటి వివరాలు తెలుపలేదు. తమ పదాతి, వాయు దళాలు గాజాలో దాడులు కొనసాగిస్తున్నట్టు మాత్రం పేర్కొంది.

ఇరాన్‌పై దాడికి ప్లాన్

గత నెలలో ఇరాన్ తమపై చేసిన దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆ మేరకు ఇజ్రాయెల్ సన్నాహాలు కూడా చేస్తున్నది. అయితే ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక సన్నాహాలను బహిర్గతం చేస్తూ రెండు అత్యంత రహస్యమైన యూఎస్ ఇంటెలిజెన్స్ పత్రాలు లీకయ్యాయని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. నేషనల్ జియో స్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఎన్‌జీఏ) నుంచి వచ్చిన పత్రాలు, అమెరికన్ గూఢచారి ఉపగ్రహాలు సేకరించిన చిత్రాలు, ఇజ్రాయెల్ సైనిక సన్నాహాలు, కార్యాచరణ తదితర అంశాలు గల ఆ రహస్య పత్రాల గురించి ఇరాన్ అనుకూల టెలిగ్రామ్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. అక్టోబర్ 1న ఇజ్రాయెల్‌పై ఇరాన్ జరిపిన దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికే చేస్తున్న సన్నాహాల గురించి అమెరికాతో ఇజ్రాయెల్ పంచుకోగా, అవి అమెరికా నుంచి లీకైనట్టు భావిస్తున్నారు. కాగా తమ రహస్య

బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడుల్లో వెలువడుతున్న పొగ

పత్రాలు లీక్ కావడం పట్ల అమెరికా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పత్రాలు ఎలా లీకయ్యాయి? అని అమెరికా ఇంటెలిజెన్స్ ఆరా తీస్తున్నది. ప్రభుత్వంలోని కింది స్థాయి ఉద్యోగి ద్వారా ఇది జరిగి ఉంటుందని అనుమాన పడుతున్నది.

హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌పై దాడి

లెబనాన్ రాజధాని బీరుట్‌లో హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌తో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఆయుధాలు దాచిన స్థావరంపై ఆదివారం దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ మిలిటరీ తెలిపింది. అలాగే దక్షిణ లెబనాన్‌లో జరిపిన లక్షిత దాడుల్లో ముగ్గురు హెజ్బొల్లా కమాండర్లు మృతి చెందినట్టు తెలిపింది.

100 రాకెట్లతో విరుచుకుపడ్డ హెజ్బొల్లా

లెబనాన్ సుమారు 100 రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా ఆదివారం ఉదయమే 70 రాకెట్లు ప్రయోగించింది. కొద్ది గంటల తర్వాత మరో 30 రాకెట్లు ఇజ్రాయెల్ వైపు దూసుకుపోయాయి. వీటిలో చాలా వాటిని ఇజ్రాయెల్ వైమానిక దళం అడ్డుకుంది. కాగా, ఈ రాకెట్ల కారణంగా ఇజ్రాయెల్‌లోని కొన్ని ప్రాంతాల్లో మంటలు చెలరేగినట్టు వార్తలొచ్చాయి.

సిన్వర్ భార్య చేతిలో రూ.26 లక్షల హ్యాండ్ బ్యాగ్

ఇటీవల తాము జరిపిన దాడుల్లో హమాస్ నేత యాహ్యా సిన్వర్‌ను హతమార్చినట్టు ప్రకటించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) తాజాగా అతనికి సంబంధించిన ఒక వీడియోను విడుదల చేసింది. గత ఏడాది అక్టోబర్ 7 దాడులకు ముందు, ముందు జాగ్రత్తగా సిన్వర్ తన గృహం కింద ఉన్న సొరంగం లోంచి కుటుంబ సభ్యులతో సహా సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న ఈ వీడియోను ఉద్దేశించి 'ఒక పక్క ఇజ్రాయెల్ మహిళలు, పిల్లలు, వృద్ధులను చంపమని ఉగ్రవాదులను పంపి, సిన్వర్ తాను, తన కుటుంబ సభ్యులు మాత్రమే క్షేమంగా ఉండాలనుకుంటున్నారు' అని పేర్కొంది. ఈ సందర్భంగా సిన్వర్ భార్య చేతిలోని హ్యాండ్ బ్యాగ్ ఖరీదు 36 వేల డాలర్లు (సుమారు రూ.26 లక్షలు) అని తెలిపింది. తమ సభ్యులను యుద్ధంలోకి పంపి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న సిన్వర్, ఆయన కుటుంబం మాత్రం పూర్తి విలాసవంతమైన జీవితాన్ని గడిపారని విమర్శించింది.

పిల్లలను చంపి వండి పెట్టేవారు!

- ఐసిస్ అరాచకాలను వెల్లడించిన బాధిత మహిళ

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: 'దశాబ్దాల తరబడి మమ్మల్ని బందీలుగా ఉంచారు. అసలు వెలుతురన్నదే లేకుండా చీకటి గృహాల్లో ఉంచేవారు. అనేకసార్లు అత్యాచారాలు చేశారు. రోజుల తరబడి తిండిపెట్టకుండా మాడ్చేవారు. మా పిల్లలను చంపి వారి మాంసాన్ని మాకు భోజనంలో వడ్డించే వారు' అంటూ ఐసిస్ బందీగా ఉంటూ విడుదలైన ఒక మహిళ వారి అరాచకాల గురించి వెల్లడించింది. గాజాలో కొన్నేండ్లుగా ఐసిస్ బందీగా ఉన్న ఫౌజియా అమీన్ సిడోను ఇటీవలే ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్), యూఎస్ ఎంబసీలు రక్షించాయి. బందీగా ఉన్న కాలంలో తాను పడిన చిత్రహింసల గురించి ఆమె ఒక బ్రిటిష్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్‌కు వివరించింది. ఉత్తర ఇరాక్‌లోని సింజార్ ప్రాంతానికి చెందిన ఈ యజిదీ మహిళకు 11 ఏండ్ల వయసున్నప్పుడు దశాబ్దం క్రితం ఐసిస్ ఉగ్రవాదులు అపహరించారు. ఉగ్రవాదులు తాము హతమార్చిన యజిదీ శిశువుల మాంసాన్ని వండి తమకు పెట్టేవారని ఆమె తెలిపింది. బందీగా ఉన్న ఒక మహిళ భోజనం చేసే సమయంలో తనకు వడ్డించిన మాంసం తన కుమారుడిదేనని తెలిసి తీవ్రంగా రోదించి గుండెపోటుతో మరణించిందని చెప్పారు.

చీకటి గదుల్లోనే ఉంచేవారు

శిశువులను చంపి వారి మాంసాన్ని వండి తినమనేవారని, తిన్న తర్వాత మీరు వీరి మాంసమే తిన్నారంటూ తలలు నరికిన శిశువుల ఫొటోలు చూపేవారని తెలిపింది. అయితే తింటున్నప్పుడు వాసన తేడాగా ఉన్నట్టు తెలిసినా ఆకలితో ఉండటం వల్ల అలాగే తినే వారమని, అది తిన్న తర్వాత కడుపు నొప్పితో పాటు పలుమార్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యామని తెలిపింది. నిస్సహాయ స్థితిలో తాము ఏమీ చేయలేకపోయేవారమని పేర్కొంది. తాము బందీగా ఉన్నంత కాలం చీకట్లోనే ఉంచారని, సూర్య కాంతిని ఎప్పుడూ చూడలేదని తెలిపింది. తాగడానికి మురికినీరు ఇచ్చేవారని, అది తాగి చాలామంది పిల్లలు మరణించారని చెప్పింది. ఎవరైనా బాలికలు నచ్చితే తమ వెంట తీసుకుపోయేవారని పేర్కొన్నది. ఐసిస్ ఉగ్రవాదులు అమ్మాయిల అక్రమ రవాణా, సెక్స్ వ్యాపారం కూడా చేసేవారని, తనకు 15 ఏండ్ల సమయంలో పలుసార్లు అత్యాచారం చేశారని, ఐదు సార్లు తనను అమ్మడం, కొనడం చేశారని తెలిపింది. తనకు పలుసార్లు డ్రగ్స్ కూడా ఇచ్చారని ఫౌజియా వెల్లడించింది.

ఈవీఎంలను హ్యాక్ చేయొచ్చు

- ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ బెటర్
- టెస్లా అధినేత ఎలాన్ మస్క్

వాషింగ్టన్, అక్టోబర్ 20: అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ టెస్లా అధినేత, ఎలాన్ మస్క్ 'ఎల్రక్టానిక్ ఓటింగ్ మెషీన్ల'(ఈవీఎం)పై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలు ఎన్నికలను 'రిగ్గింగ్' (ఫలితాన్ని ప్రభావితం) చేస్తున్నాయని, కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చునని అన్నారు. బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించటాన్ని, చేత్తో ఓట్ల లెక్కింపు ఎన్నికలను ఎలాన్ మస్క్ సమర్థించారు. పెన్సిల్వేనియాలో ఓ ప్రచార సభలో మస్క్ ప్రసంగిస్తూ, 'నేను ఓ టెక్నాలజిస్ట్‌ను. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌ను చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చు' అని అన్నారు. ఎన్నికల్లో 'డొమినియన్' కంపెనీ ఈవీఎంల వాడకాన్ని మస్క్ వ్యతిరేకించారు. దేశమంతా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల్ని నిర్వహించాలని అన్నారు.

2028లోపు మళ్లీ సీఎం అవుతా

- కాంగ్రెస్‌లో అసంతృప్తి వల్ల సిద్ధూ సర్కార్ పతనం
- కేంద్ర మంత్రి కుమారస్వామి

బెంగళూరు, అక్టోబర్ 20: తాను 2028 లోపు మళ్లీ కర్ణాటక సీఎం అవుతానని కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్తి కారణంగా ప్రస్తుత ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెప్పారు. '2028లోపు నాకు సీఎం అయ్యే అవకాశం లభిస్తుంది. ప్రజలు కోరుకుంటే నేనెందుకు ముఖ్యమంత్రి కాకూడదు? నేను ఐదేండ్లపాటు సీఎంగా కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తున్నా' అని పేర్కొన్నారు.

బిష్ణోయ్‌కు ఏడాదికి రూ.40 లక్షల ఖర్చు

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: ఇటీవల ముంబైలో మాజీ ఎమ్మెల్యే బాబా సిద్దిఖీ హత్యతో మరోసారి వెలుగులోకి వచ్చిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గురించి విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. 31 ఏండ్ల బిష్ణోయ్ ప్రస్తుతం జైలులో ఉన్నప్పటికీ అతని కోసం తమ కుటుంబం ఏడాదికి రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు అతని కజిన్ రమేశ్ బిష్ణోయ్ తెలిపారు. జీవితంలో లారెన్స్ ఇలా అవుతాడని కుటుంబ సభ్యులెప్పుడూ కనీసం ఊహించ లేదని ఆయన చెప్పారు. ఐశ్వర్యవంతుల కుటుంబంలో పుట్టి లా చదివిన బిష్ణోయ్ తర్వాత గ్యాంగ్‌స్టర్ అయ్యాడు.

నాగ్‌పూర్ నైరుతి నుంచి ఫడ్నవీస్ పోటీ

99 మందితో బీజేపీ తొలి జాబితా

ముంబై, అక్టోబర్ 20: మరో నెల రోజుల్లో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 99 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా ప్రకటించింది. ఇందులో డిప్యూటీ సీఎం ఫడ్నవీస్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బవాంకులే, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ తదితరుల పేర్లు ఉన్నాయి. నాగ్‌పూర్ (నైరుతి) స్థానం నుంచి ఫడ్నవీస్, కామ్టీ నియోజకవర్గం నుంచి బవాంకులే, కొలాబా స్థానం నుంచి నార్వేకర్ పోటీ చేయబోతున్నారు. మంత్రి సుధీర్ ముగంటివార్, మాజీ సీఎం అశోక్ చవాన్ కుమార్తె శ్రీజయ అశోక్ చవాన్ తదితరులకు బీజేపీ టికెట్లు ఇచ్చింది.

'మహా' బరిలో జరాంగే అభ్యర్థులు

మరాఠా ప్రాబల్య స్థానాల్లో పోటీ

జాల్నా, అక్టోబర్ 20: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మరాఠాల ప్రాబల్యం ఉన్న చోట అభ్యర్థులను బరిలోకి దింపుతానని మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జరాంగే ఆదివారం ప్రకటించారు. ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరాఠా వర్గం గెలిచే అవకాశం ఉన్నచోట మాత్రమే మరాఠా అభ్యర్థులను పోటీలో నిలుపుతానన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో మరాఠా రిజర్వేషన్లను సమర్థించే అభ్యర్థులను తన బృందం బలపరుస్తుందన్నారు. మరాఠా సామాజిక వర్గం గెలిచే అవకాశం లేనిచోట మరాఠా రిజర్వేషన్లకు మద్దతిచ్చే అభ్యర్థులకు వారి పార్టీ, కులం, మతం గురించి పట్టించుకోకుండా మద్దతు ఇస్తామన్నారు. బలమైన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని, వారి అభ్యర్థిత్వంపై ఈ నెల 29న అంతిమ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మరాఠా రిజర్వేషన్ ఉద్యమాన్ని డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అణగదొక్కారని జరాంగే ఆరోపించారు.

ప్రియాంక గాంధీకి పోటీగా నవ్య

వయనాడ్ లోక్‌సభ బరిలో నిలిపిన బీజేపీ

వయనాడ్, అక్టోబర్ 20: వయనాడ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రాకు పోటీగా తమ పార్టీ కేరళ మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ నవ్య హరిదాస్(36)ను బీజేపీ బరిలోకి దింపింది. శనివారం ఆమెను అభ్యర్థిగా ప్రకటించింది. బీటెక్ చదివిన నవ్య కోజికోడ్ కార్పొరేషన్ నుంచి రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. కోజికోడ్ కార్పొరేషన్ బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా వ్యవహరిస్తున్నారు. నవ్య 2021లో కోజికోడ్ దక్షిణ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఏడీఆర్ సంస్థ సమాచారం ప్రకారం ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. మరోవైపు ఎల్డీఎఫ్ కూటమి వయనాడ్ ఎంపీ అభ్యర్థిగా సీపీఐ సీనియర్ నేత సత్యన్ మోకెరిని ప్రకటించింది.

పాక్ అమ్మాయితో బీజేపీ నేత కొడుకు ఆన్‌లైన్ పెండ్లి

న్యూఢిల్లీ: యూపీ బీజేపీ నేత కుమారుడు పాకిస్థాన్ అమ్మాయిని శుక్రవారం ఆన్‌లైన్‌లో 'నిఖా' చేసుకున్నాడు. బీజేపీ కార్పొరేటర్ అయిన తహసీన్ షాహిద్ తన కుమారుడు మొహమ్మద్ అబ్బాస్ హైదర్‌కు పాకిస్థాన్‌లోని లాహోర్‌కు చెందిన అంద్లీప్ జారాతో వివాహం నిశ్చయించాడు. వీసా కోసం ప్రయత్నించినప్పటికీ ఇరు దేశాల మధ్య ఉన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా లభించలేదు. మరోవైపు, వధువు తల్లి రానా యాస్మిన్ జైదీ అనారోగ్యంతో ఐసీయూలో చేరడంతో త్వరగా పెళ్లి జరిపించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మరోమార్గం లేక ఆన్‌లైన్‌లోనే తన కుమారుడికి నిఖా జరిపించాలని షాహిద్ నిర్ణయించుకున్నాడు.

ప్రపంచంలోనే ఎత్తయిన వెదురు టవర్

ఛత్తీస్‌గఢ్‌లో నిర్మాణం

రాయ్‌పూర్, అక్టోబర్ 20: ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ స్ఫూర్తితో దాన్ని పోలిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వెదురు టవర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో నిర్మించారు. 140 అడుగుల ఎత్తు కలిగిన ఈ నిర్మాణం రాయ్‌పూర్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని కతియా గ్రామంలో ఉంది. రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన 7400 కిలోల బరువు కలిగిన ఈ టవర్‌ను కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. పర్యాటక ఆకర్షణగా నిలిచిన ఈ టవర్‌ను భవ్య సృష్టి అనే స్టార్టప్ నిర్మించింది. దీని జీవిత కాలం 25 ఏండ్లని ఆ సంస్థ తెలిపింది. దీన్ని వాచ్ టవర్, టెలికామ్ టవర్, ప్రసార టవర్, రేడియో టవర్‌గా ఉపయోగించుకొనేందుకు తగిన సామర్థ్యం కలిగి ఉందని చెప్పింది.

అయోధ్య వివాదం పరిష్కారం కోసం

అప్పట్లో భగవంతుడిని ప్రార్థించా

సీజేఐ డీవై చంద్రచూడ్

పుణె, అక్టోబర్ 20: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై ఒక పరిష్కారానికి తాను భగవంతుడిని ప్రార్థించానని, విశ్వాసం ఉంటే దేవుడే ఒక మార్గాన్ని కనుగొంటాడని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. తన స్వగ్రామమైన ఖేడ్ తాలుకాలోని కన్హెర్సర్ గ్రామంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పరిష్కారం దొరకని కేసులు చాలా అరుదుగా మా వద్దకు వస్తుంటాయి. అలాంటిదే అయోధ్య కేసు కూడా. మూడు నెలలుగా ఈ కేసు నా వద్ద ఉంది. నేను భగవంతుడి ముందు కూర్చొని, కేసుకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని చెప్పాను' అని సీజేఐ పేర్కొన్నారు. తాను రోజూ భగవంతుడికి ప్రార్థనలు చేస్తానన్నారు. 'నమ్మండి, మీకు గనుక విశ్వాసం ఉంటే భగవంతుడు ఎప్పుడూ మీకు మార్గం చూపిస్తాడు' అని ఆయన అన్నారు. కాగా, శతాబ్ద కాలంగా వివాదంలో ఉన్న రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం 2019 నవంబర్ 9న చారిత్రాత్మక తీర్పు చెప్పింది. కాగా, ఆ ధర్మాసనంలో డీవై చంద్రచూడ్ కూడా సభ్యుడిగా ఉన్నారు.

మరో 25 విమానాలకు బాంబు బెదిరింపులు

ముంబై, న్యూఢిల్లీ, అక్టోబర్ 20: భారత విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా ఆదివారం 25 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇండిగో, విస్తారా, ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా సంస్థలకు చెందిన స్వదేశీ, విదేశీ విమాన సర్వీసులకు ఈ బెదిరింపులు వచ్చాయి. ఈ వారంలో ఇప్పటివరకు 90కి పైగా విమానాలకు ఇలా బెదిరింపులు వచ్చాయి. తాజా బెదిరింపుల దృష్ట్యా భద్రతా తనిఖీలు నిర్వహించామని ఇండిగో, విస్తారా సంస్థలు తెలిపాయి. చాలావరకు సామాజిక మాధ్యమాల ద్వారా వస్తున్న బాంబు బెదిరింపులను దృష్టిలో ఉంచుకొని పౌర విమానయాన భద్రత బ్యూరో శనివారం వివిధ విమానయాన సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. బూటకపు బాంబు బెదిరింపుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. నకిలీ బాంబు బెదిరింపు ఘటనలను నిరోధించడానికి అలాంటి బెదిరింపులకు పాల్పడే నేరస్థుల విమానయానాన్ని నిషేధించడంతో పాటు కఠిన నిబంధనలను అమలు చేయాలని పౌర విమానయాన శాఖ యోచిస్తున్నది.

జోధ్‌పూర్ ఎయిర్‌పోర్టులో పహారా నిర్వహిస్తున్న భద్రతా దళాలు

జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

- వలస కార్మికులపై కాల్పులు
- ఒక డాక్టర్, ఐదుగురి మృతి
- పలువురికి తీవ్రగాయాలు
- పిరికిపందల చర్య: సీఎం ఒమర్

శ్రీనగర్, అక్టోబర్ 20: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. వలస కార్మికులే లక్ష్యంగా మళ్లీ కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం సాయంత్రం గందేర్‌బల్ జిల్లా గగన్‌గిర్ వద్ద నిర్మాణరంగ కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒక వైద్యుడు, మరో ఐదుగురు వలస కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని జిల్లా అధికార వర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల క్రితం సోఫియాన్ జిల్లాలో ఓ బీహారీ కార్మికుడ్ని ఉగ్రవాదులు కాల్చిచంపారు. తాజా ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరాయుధలైన అమాయక పౌరుల్ని హత్య చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సోనామార్గ్ రీజియన్‌లో గగన్‌గిర్ వద్ద నాన్ లోకల్ కార్మికులపై ఉగ్రదాడి పిరికిపందల చర్య. రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కార్మికులు పనిచేస్తున్నారు. గాయపడ్డవాళ్లను శ్రీనగర్‌లోని స్కిమ్స్ దవాఖానకు తరలించాం' అని ఎక్స్ వేదికగా సందేశాన్ని పోస్ట్ చేశారు. ఇక్కడి గగన్‌గిరి వద్ద సొరంగ నిర్మాణ పనులు చేస్తున్న ప్రైవేట్ కంపెనీ కార్మికులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారని 'ఎక్స్' వేదికగా జమ్ముకశ్మీర్ పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆర్మీ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. దాడులకు దిగిన ఉగ్రవాదుల కోసం సెర్చ్ ఆపరేషన్ మొదలైందని అధికారులు తెలిపారు.

ఢిల్లీలో పాఠశాల వద్ద పేలుడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఢిల్లీ రోహిణిలోని ప్రశాంత్ విహార్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ స్కూల్ వెలుపల ఆదివారం ఉదయం 7.50 గంటలకు భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ఈ పేలుడుతో పాఠశాల గోడ దెబ్బతినగా, చుట్టుపక్కల దుకాణాలు, ఇండ్లు, ఒక కారు స్వల్పంగా ధ్వంసమైంది. పేలుడు తర్వాత ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. బాంబు స్క్వాడ్, పోలీసులు, ఎన్ఐఏ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. నాటు బాంబు కారణంగా ఈ పేలుడు సంభవించి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలి నుంచి తెల్లటి పొడి, మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకుని, ఫోరెన్సిక్‌కు పంపారు.

అండర్‌వరల్డ్ డాన్‌ల శకంలా.. ఢిల్లీ

పేలుడుపై ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ తీవ్రంగా స్పందించారు. ఈ పేలుడు ఢిల్లీలో దిగజారిన శాంతిభద్రతలను సూచిస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఢిల్లీలోని శాంతి భద్రతల పర్యవేక్షణ బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని, అయితే దానిని మరచిన ప్రభుత్వం అధికారంలోని ఆప్ ప్రభుత్వాన్ని ఎలా ఇబ్బంది పెట్టాలా అని నిత్యం ఆలోచిస్తున్నదని విమర్శించారు. ఒకప్పుడు అండర్‌వరల్డ్ శకంలో ముంబై ఎలా ఉండేదో, ఇప్పుడు ఢిల్లీలో అలాంటి పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

అన్‌లిమిటెడ్ రేంజ్ ఈవీ!

- ప్రయాణించే కొద్దీ బ్యాటరీ ఎనర్జీ పెరుగుదల
- 'ఈ-క్యాట్' టెక్నాలజీతో అద్భుతం

లాటినా (ఇటలీ), అక్టోబర్ 20: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) రంగంలో అద్భుతం ఆవిష్కృతమైంది. మాడిఫై చేసిన ఓ ఎలక్ట్రిక్ కారుతో 'అన్‌లిమిటెడ్ రేంజ్' సాధ్యమైంది. ఇటలీలోని లాటినాలో గత నెల ఆ కారు పనితీరును ప్రదర్శించారు. 6 గంటలపాటు ప్రయాణించిన తర్వాత ఆ కారు బ్యాటరీలో శక్తి సాంద్రత తగ్గకపోగా మరింత పెరిగినట్టు ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ నిపుణులు తేల్చారు. ఈ ప్రదర్శనలో ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రెనాల్ట్ తయారు చేసిన రెండు 'ట్విజీ 80' మోడళ్ల పనితీరును పరీక్షించారు. ఈ పరీక్షకు ముందు ఆ రెండు కార్ల బ్యాటరీల్లోని శక్తి సాంద్రతను నమోదు చేసుకున్నారు. వాటిలో 96% శక్తిని కలిగివున్న అన్‌మాడిఫైడ్ కారు 2 గంటల 20 నిమిషాల్లో 45 మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత బ్యాటరీ పూర్తిగా డిశ్చార్జి కావడంతో ఆగిపోయింది. కానీ, 'ఈ-క్యాట్' పవర్ జనరేషన్ సిస్టమ్‌ను అమర్చిన మాడిఫైడ్ కారు మాత్రం అద్భుతమైన పనితీరును కనబర్చింది. బ్యాటరీలో 62% శక్తి సాంద్రతను కలిగివున్న ఆ కారు నిరంతరాయంగా 6 గంటల్లో 124 మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత శక్తి సాంద్రత 83 శాతానికి పెరిగింది. ఇది ఆ వాహన పరీక్ష ప్రారంభమైనప్పుడు బ్యాటరీలో ఉన్న శక్తి కంటే 33% అధికం. ఈ కారులో అమర్చిన 'ఈ-క్యాట్' పవర్ జనరేషన్ సిస్టమ్‌ను లియోనార్డో కార్పొరేషన్ అభివృద్ధి చేసింది. నడుస్తున్న ఎలక్ట్రిక్ వాహనం బ్యాటరీని 'ఈ-క్యాట్' టెక్నాలజీతో నిరంతరాయంగా చార్జింగ్ చేయవచ్చని, తద్వారా ఆ వాహనం ఇంధనంతో పనిలేకుండా ఎలాంటి ఉద్గారాలను వెలువరించకుండా అపరిమిత దూరం ప్రయాణించగలుగుతుందని ఆ కంపెనీ చెప్తున్నది.

'గుడ్‌బై' హగ్స్ 3 నిమిషాలకు మించకూడదు

న్యూజిలాండ్ విమానాశ్రయంలో కొత్త నిబంధన

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌లోని డ్యునెడిన్ విమానాశ్రయంలో కనిపిస్తున్న సైన్‌బోర్డు ఒకటి ఆన్‌లైన్‌లో చర్చకు కారణమైంది. తమ వారిని సాగనంపేందుకు వచ్చేవారు మూడు నిమిషాలకు మించి హగ్ చేసుకోకూడదట. లేదూ.. ఇంకా సమయం కావాలంటే మాత్రం డ్రాప్-ఆఫ్ ఏరియాకు బదులు కార్ పార్కింగ్ స్థలాన్ని ఉపయోగించుకోవచ్చట. గరిష్ఠంగా మూడు నిమిషాలు మాత్రమే హగ్ చేసుకోవాలని రాసున్న సైన్‌బోర్డును ఫొటోతీసిన ఒకరు దానిని ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. నెటిజన్లు రెండుగా విడిపోయి దీనిపై చర్చించుకుంటున్నారు. ఇది మంచి నిర్ణయమని ఒకవేళ ఆపేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే 5 నుంచి 100 పౌండ్ల వరకు జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుందని ఒకరు కామెంట్ చేస్తే, మరీ మూడు నిమిషాలేనా? అమెరికాలో అయితే ఆపాలని కూడా ఎవరూ అనుకోరు! అని మరొకరు రాసుకొచ్చారు. ఈ సైన్‌బోర్డు ఏర్పాటుపై డ్యునెడిన్ ఎయిర్‌పోర్టు సీఈవో డేనియల్ డి బోనో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టులు ఎమోషనల్ హాట్‌స్పాట్లని, 20 సెకన్లు హగ్ చేసుకున్నా లవ్ హార్మోన్ ఆక్సిటోసిన్ విడుదలవుతుందని పేర్కొన్నారు. ఈ ఏర్పాటు వల్ల ఎక్కువమందికి హగ్ చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.